క్లుప్తంగా

వాస్తవాలు మాట్లాడాలి

నారాయణపేట టౌన్‌: జిల్లాకు సాగునీరు అందిస్తామని ఏడేళ్లుగా ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డి ప్రకటిస్తున్నారని, సాధ్యం కాని వాగ్దానంపై ఇకనైనా వాస్తవాలు మాట్లాడాలని బీజేపీ జిల్లా లీగల్‌ సెల్‌ కన్వీనర్‌ నందు నామాజీ బుధవారం ప్రకటనలో హితవు పలికారు. పాలమూరు–రంగారెడ్డి పథకం కేవలం తాగునీటి కోసమేనని, సుప్రిం కోర్టు కుండబద్దలు కొట్టినా మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాలమూరూ ద్వారా ప్రత్యేకంగా నారాయణపేట కాల్వతో జయమ్మ చెరువు నింపి సాగునీరు అందిస్తామని పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారను. ఎన్నికల ముందు నీళ్ల ఇవ్వకపోతే ఓట్లు అడగమని చెప్పారని, వీరికి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వ సహకారం



మరికల్‌: ప్రభుత్వం సహకారం వల్లే మత్స్యకారుల కార్మికులు అభ్యున్నతి చెందుతున్నారని ఎంపీటీసీ సుజాత, మండల మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు చంద్రశేఖర్‌, శ్రీనివాస్‌, కొండప్ప అన్నారు. మండల కేంద్రంలోని పెద్దచెరువుల్లో పడుతున్న చేపలను బుధవారం మత్స్య పారిశ్రామిక సంఘం సభ్యులకు అందజేశారు. ప్రభుత్వం చెరువుల్లో చేపలను వదలడం వల్ల మంచి లాభాలు వస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మికులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మక్తల్‌: పట్టణంలో బాలికల ఉన్నత పాఠశాలలో 1996–97 పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు చందులాల్‌, సుజాతను సన్మానించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలకు మైక్‌ సెట్‌ వితరణ చేశారు. కార్యక్రమంలో పరంజ్యోతి, పద్మ, రాజేశ్వరి, హరిత, స్వప్న, రాధా, జయశ్రీ, సంగీత, తులసీబాయి, వీణ, రజిని, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆలయానికి విరాళం

నారాయణపేట టౌన్‌: జిల్లా కేంద్రంలోని బాపునగర్‌ చౌడేశ్వరి మాత దేవాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం పేరపళ్ల చెందిన రామకృష్ణ రూ.25,116 చెక్కును తొగట వీర క్షత్రీయ సంఘం నాయకులకు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

మఠం భూములను కాపాడాలని వినతి




మాగనూర్‌: మండలంలోని నేరడగంలోని పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంకు చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని కాపాడాలని వికారాబాద్‌ కలెక్టర్‌ నారాయణరెడ్డిని బుధవారం సిద్ధలింగ మహాస్వాములు కలిసి విన్నవించారు. వారు మాట్లాడుతూ.. వికారాబాద్‌ జిల్లాలోని కొడంగల్‌, దౌల్తాబాద్‌, ఇతర మండలాల్లో మఠంకు సంబంధించిన అనేక ఎకరాలు అన్యాకాంత్రమయ్యాయని తెలిపారు. భూములను గుర్తించి మఠంకు చెందే విధంగా చూడాలని కోరారు.

'కంటివెలుగు' శిబిరం ప్రారంభం

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో బుధవారం కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. రాంకిష్టాయిపల్లిలో పూర్తి కాగా కిష్టాపూర్‌ పంచాయతీ కార్యాలయంలో శిబిరం ఏర్పాటు చేశామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్‌ దామోదర్‌రెడ్డి కోరారు.

ఓటరు నమోదుపై సమీక్ష



ధన్వాడ: ఓటరుగా నమోదు, తొలగింపుపై బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో బీఎల్‌ఓలకు తహసీల్దార్‌ నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. గ్రామాలలో కొత్త ఓటరు నమోదు, జాబితాలో పేర్లు తొలగించడం వంటి విషయాలపై వారికి పలు సుచనలు చేశారు. ఆర్‌ఐ మల్లేష్‌, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అవుసలోనిపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



కాన్‌కుర్తిలో నేల రాలిన మామిడి

అకాల వర్షం.. తడిసిన ధాన్యం

మక్తల్‌: అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని మాద్వార్‌, ఖానాపూర్‌, పంచలింగాల, కర్ని, రుద్రసముద్రం, కాట్రేవ్‌పల్లి, మక్తల్‌లో వర్షం కురిసింది. రుద్రసముద్రం, మాద్వార్‌, కర్నిలో పంటలు నేలమట్టమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున అకాల వర్షం కురిసింది. మండల కేంద్రం శివారులో వర్షం పెద్దగా రావడంతో ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. మక్తల్‌ పట్టణంలో ఆంజనేయస్వామి దేవాలయం ముందు రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మక్తల్‌ హైదరాబాద్‌ రూట్‌కు వెళ్లే ఎస్‌బీఐ ముందు రోడ్లపై నీరు అధికంగా నిలిచి ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కాలనీల్లో పర్యటించారు.

మాగనూర్‌: మండలంలోని పలు గ్రామాలలో స్వల్పంగా పంటలు ధ్వంసం కాగా, ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. దాదాపుగా మండలంలో 30 శాతంపైగా వరి పంటలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఉంచారు. రైతులకు అకాల వర్షం కన్నీటిని మిగిల్చిందని వాపోతున్నారు.

ధన్వాడ: మండలంలో కురిసిన వర్షానికి వరి ధాన్యం తడిసింది. ఎక్కువగా యంనోనిపల్లి, గున్ముక్ల, మంత్రోనిపల్లి శివారులో వర్షం అధికంగా కురిసింది. యంనోనిపల్లికి చెందిన గొనిశ్రీనివాసులు 8 ఎకరాలు, ఇందిరమ్మ 4 ఎకరాలు, మల్లప్ప 6 ఎకరాలు, ఆంజనేయులు 2ఎకరాలు, హనుమంతు 5 ఎకరాలలో వర్షపు నీరు చేరిందని తెలిపారు.

మరికల్‌: మండల వ్యాప్తంగా అర్ధరాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయశాఖ అధికారులు బుధవారం గ్రామాల వారిగా పంటలను పరిశీలించారు. మండలంలో పెద్దగా పంటలకు నష్టం కాలేదని, దాదాపు వంద ఎకరాల వరకు నష్టం వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.

కృష్ణా: మండలంలోని రైతులు ఇప్పటికే 90 శాతం వరి కోతలు పూర్తి చేసుకోవడంతో రైతులు నష్టం నుంచి బయటపడ్డారు. కల్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యంలోకి కొన్ని చోట్ల వర్షం నీరు చేరి తడిసిందని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్‌ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పొలాలను పరిశీలించినట్లు ఏఈఓ పేర్కొన్నారు. వాసునగర్‌లోని నాగేశ్వర్‌రావ్‌ రైతుతో పాటు, ఐనాపూర్‌లో ఓ రైతు ధాన్యంలో మాత్రమే నీరు చేరడంతో కొంత మేరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఊట్కూరు: మండలంలో సుమారు 250 ఎకరాల వరి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి తెలిపారు. ఊట్కూరు, బిజ్వార్‌, పులిమామిడి, అవుసలోనిపల్లి, నిడుగుర్తి, తిప్రాస్‌పల్లి గ్రామాలలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. బుధవారం వ్యవసాయ అధికారులు పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు.

దామరగిద్ద: మండలంలో 7.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. విఠలాపూర్‌, ఉల్లిగుండం, అన్నాసాగర్‌, మొగుల్‌మడ్క, నర్సాపూర్‌లో వడగళ్ల వర్షం కురువడంతో 32 మంది రైతులకు చెందిన 40 ఎకరాల పంట పంటనష్టం వాటిల్లింది. కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి, ఆశన్‌పల్లి, క్యాతన్‌పల్లి తదితర గ్రామాల్లో వరి పంటతో పాటు ఈదరుగాలులకు మామిడి కాయలు రాలిపోయాయి. 3.5 ఎకరాల కీరదోస నష్టపోయినట్లు మండల వ్యవసాయ అధికారి అరవింద్‌ గుర్తించినట్లు తెలిపారు. కంసాన్‌పల్లి ఎకరం మిర్చి, దామరగిద్ద, బాపన్‌పల్లి వత్తుగుండ్ల, దేశాయ్‌పల్లి సజనాపూర్‌ మద్దెల్‌బీడ్‌ గ్రామాల్లో వర్షం నీటి వరదలతో నేల కోతలకు గురికాగా పలు చోట్ల పంటలు దెబ్బతిన్నాయి. యాసంగి సాగులో వరి 14,946 ఎకరాల్లో, మామిడి 190 ఎకరాల్లో సాగులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.



మక్తల్‌ శివారులో నేలకొరిగిన వరిపంట

తడిసి ముద్దయిన 'పేట'

నారాయణపేట టౌన్‌: ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమికి ఉక్కిరి బిక్కిరి అవుతున్న తరుణంలో మంగళవారం రాత్రి ఒక్కసారి వాతావరణం ఓ మోస్తరు వర్షం కురిసి చల్లబడింది. దాదాపు గంట పాటు ఈదురు గాలితో పాటు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రోడ్లన్నీ వర్షపు నీరు, మురుగు పారడంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వ చిన్న పిల్లల ఆస్పత్రి, పాతగంజ్‌, సివిల్‌లైన్‌ రహదారుల్లో వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌ ఇబ్బందులు ఏర్పడ్డాయి. మోనప్ప కాలనీ, గాంధీనగర్‌, సాయి విజయ్‌ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. వర్షపు కురుస్తున్న సమయంలో విద్యుత్‌ అంతరాయం ఏర్పడింది. 76.4 మీ.మీ వర్షాపాతం నమోదైంది.



మరికల్‌లో తడిసిన వడ్లను చూపిస్తున్న రైతులు



వాసునగర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మక్తల్‌లో మురుగు కాల్వ వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

కమీషన్‌ విధానం రద్దు చేయాలి

నారాయణపేట రూరల్‌: రేషన్‌ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బుధవారం మండలంలోని కోటకొండలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డీలర్లకు కమీషన్‌ విధానం రద్దు చేసి గౌరవ వేతనం అందించాలని కోరారు. ఎంఎల్‌ఎస్‌ పాయింట్‌లోనే బియ్యం తూకంవేసి దుకాణాలకు సరఫరా చేయాలని, అన్‌లోడింగ్‌ ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు. డీలర్ల కుటుంబాలకు హెల్త్‌కార్డులు అందించి ఆరోగ్యాన్ని కాపాడాలని, డీలర్‌ మరణానంతరం అంత్యక్రియలకు రూ.20వేలు అందించాలన్నారు. అంతకుముందు సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేసి, ప్రతిజ్ఞ చేశారు.



కోటకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న రేషన్‌ డీలర్లు

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో కళ్లకు గంతలు కట్టుకుని దీక్షలో కూర్చున్న వీఓఏలు

మాగనూర్‌: వీఓఏల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ నియోజకర్గ ఇన్‌చార్జ్‌ పాలెం వెంకటయ్య డిమాండ్‌ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మెకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితిలో కనీసం కూరగాయలు కూడా కొనలేని ధీన స్థితిలో పేదవారున్నారని తెలిపారు. అలాంటిది కేవలం నెల మొత్తం కష్టపడి రూ.3,900 జీతంతో కుటుంబ పోషణ ఎలా సాధ్యం అనే అంశాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. శ్రమను గుర్తించి కనీస వేతనం రూ.26వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో అర్జున్‌రాజు, నరేందర్‌, పరశురాం, రమేష్‌, బాబు, విష్ణు, పావని పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకుని..

మక్తల్‌: పట్టణంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద 10వ రోజు వీఓఏలు దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు కళ్లకు గంతలు కట్టుకుని దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో బాలయ్య, రాంరెడ్డి, జ్యోతి, చంద్రకళ, బాలయ్య, రాంరెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం



చిన్నారులకు పుస్తకాలు అందిస్తున్న జిల్లా అధికారులు

నారాయణపేట రూరల్‌: చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకశక్తి, సాంస్కృతిక కళలను బయటకు తీయడానికి బాలకేంద్రం ఎంతో ఉపకరిస్తుందని బీసీ వెల్ఫేర్‌ జిల్లా అధికారి కృష్ణమాచారి, డీఈఓ లియాకత్‌అలీ, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌ తెలిపారు. బుధవారం స్థానిక మినీగ్రౌండ్‌లోని బాలకేంద్రంలో శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. దశాబ్దాల కాలంగా పట్టణం, చుట్టుపక్కల గ్రామాల చిన్నారులకు ఎంతో మందిని చక్కటి కళాకారులుగా తీర్చి దిద్ది రాష్ట్ర, జాతీయ స్థాయికి పంపిన చరిత్ర బాలకేంద్రానికి ఉందన్నారు. ఏటా వేసవిలో నిర్వహించే శిబిరం ఈసారి సైతం 41రోజుల పాటు ఉంటుందని తెలిపారు. మినీ స్టేడియం గ్రౌండ్‌లోని బాలభవన్‌లో ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. గాత్రం, నృత్యం, చిత్రలేఖనం, సితార్‌, తబల తదితర అంశాలపై ఆసక్తి కలిగిన చిన్నారులు రూ.50 అడ్మిషన్‌ ఫీజు చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ప్రశంసాపత్రాలను అందిస్తారని చెప్పారు. అంతకుముందు 60మంది చిన్నారులకు నోటు పుస్తకాలను బహూకరించారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్‌ మహిపాల్‌రెడ్డి, సిబ్బంది, చిన్నారులు పాల్గొన్నారు.

ఉగాది నంది పురస్కారం ప్రదానం



మరికల్‌: మండల కేంద్రానికి చెందిన పురోహితుడు మహేష్‌ బుధవారం ఉగాది నంది పురస్కారం అందుకున్నారు. ఉత్తమ పురోహితుడిగా ఎంపిక కావడంతో ఆయనకు హైదరాబాద్‌లో వేద్ర బ్రహ్మణ పురోహితుల ఆధ్వర్యంలో ఉగాది నంది పురస్కారం అందజేసి సత్కరించారు.

కొత్తపల్లి తహసీల్దార్‌గా లతారెడ్డి



మద్దూరు: కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా లతారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాణాప్రతాప్‌సింగ్‌ సెలవులపై వెళ్లడంతో కోస్గిలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఈమె కొత్తపల్లికి బదిలీపై వచ్చారు. కొత్త మండలంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

వేసవిలోనే పదోన్నతులు చేపట్టాలి

కోస్గి: ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న పదోన్నతులు, బదిలీలు ఈ వేసవి సెలవుల్లోనే చేపట్టాలని తపస్‌ జిల్లా అధ్యక్షుడు శేర్‌ కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు మల్లికార్జున్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం పట్టణంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకొని కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని పరిష్కారం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ విధానం రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, వెంకట్‌రాములు, చంద్రమౌళి, రాంగోపాల్‌, వెంకటేష్‌, రవీందర్‌నాయక్‌, శశిధర్‌, రమేష్‌ పాల్గొన్నారు.



రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఊట్కూర్‌: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సింగల్‌ విండో కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సింగల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్‌ సూర్యప్రకాష్‌రెడ్డి, అరవింద్‌, హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నష్టపరిహారం అందించి ఆదుకోండి

మక్తల్‌: అకాల వర్షం రావడంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్‌ తిరుపతయ్య, డీఏఓ జాన్‌సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. చేతికి వచ్చిన పంటలు అకాల వర్షాలకు తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నర్సింహులు, రవికుమార్‌, శ్రీనివాసులు, నాగేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌, గోవర్ధన్‌, కిష్టప్ప, పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం సేకరించండి: బీజేపీ

నారాయణపేట రూరల్‌: అకాల వర్షంతో జిల్లాలో పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ప్రభుత్వాన్ని బుధవారం ప్రకటనలో డిమాండ్‌ చేశారు. రైతులకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని వెంటనే సేకరిస్తే నష్టం తగ్గించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందించాలని, రూ.50వేల పరిహారం ఇవ్వాలని కోరారు.



డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

దెబ్బతిన్న పంటల పరిశీలన

మాగనూర్‌: కోత సమయంలో అధిక గాలులతో కూడిన వర్షాలు, వడగళ్ల వాన వల్ల వరి పైరు పడిపోయి గింజ మొలకెత్తటం, రంగు మారుతుందని, అటువంటి పరిస్థితులలో వీలైన చోట పైరును నిలగట్టాలని మండల వ్యవసాయ అధికారి హరిత అన్నారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షాల కారణంగా పంట నష్టం అంచన వేయడం కోసం ఆమె ఏఈఓలతో కలిసి మండలంలో ఆయా గ్రామాలలో పంటలను పరిశీలించారు. అనుకున్న దానికంటే చాలా తక్కువ నష్టం వాటిల్లిందని తెలిపారు. మండలంలోని పర్మన్‌దొడ్డి, మందిపల్లిలో మాత్రమే పంట నష్టం కొంత మేర వాటిల్లిందని, అది కూడా ఆందోళన లేదని చెప్పారు. రైతులు వరి పంటలపై 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని ఒక లీటర్‌ నీటికి పిచికారి చేయాలని సూచించారు.



వర్కూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ

ఘనంగా అష్టోత్తర కలశాభిషేకం

నారాయణపేట రూరల్‌: మండలంలోని సింగారం గిరిపీఠంపై కొలువైన భవానీమాత ఆలయంలో బుధవారం పుష్కర బ్రహ్మోత్సవాలు ప్రారంభయ్యాయి. అమ్మవారికి అష్టోత్తర కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి 108 కలశాలతో మహిళలు, బాలికలు శోభాయాత్రగా అమ్మవారి గుడికి చేరుకున్నారు. భక్తి సంకీర్తనలు, భజనలతో ఊరేగింపుగా అమ్మవారి నామస్మరణతో సాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి తదితర పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన చేశారు.



కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

ఈతకు వెళ్లే యువత జాగ్రత్త

నర్వ: విద్యార్థులు, యువకులు ఈతకు వెళ్లేటప్పుడు పెద్దలతోనే వెళ్లాలని ఎస్‌ఐ విక్రమ్‌ అన్నారు. బుధవారం రాత్రి రాంపురంలో ప్రజలకు కళాజాతా నిర్వహించారు. వారు ఆట, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్‌ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, మొబైల్‌ఫోన్‌లు పోగుట్టుకుంటే సీఈఐఆర్‌ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈతకు కుంటలు, చెరువుల వద్దకు వెళ్లొద్దని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. సీసీ కెమెరాలను గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విక్రమ్‌

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

కోస్గి: టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో కాంగ్రెస్‌ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. పట్టణంలో, మండలంలోని రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చినటువంటి పనులే చేస్తున్నారని, కొత్తగా ఎమ్మెల్యే చెప్పుకోదగిన పనులు ఏవని ప్రశ్నించారు. నియోజకవర్గంలో భూదందాల కోసం ఎమ్మెల్యే వస్తున్నారు తప్పా, అభివృద్ధి కోసం కాదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేకు ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రేవంత్‌రెడ్డి కొడంగల్‌ నుంచే పోటీ చేసి గెలుస్తారని జోస్యం చెప్పారు. మరోసారి రేవంత్‌రెడ్డిపై అవాకులు చెవాకులు పేలితే ఊరుకునేది లేదన్నారు. కార్యక్రమంలో వార్ల విజయ్‌కుమార్‌, విక్రమ్‌రెడ్డి, సరేష్‌రెడ్డి, అనంతయ్య, సుధాకర్‌గౌడ్‌ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్‌ నాయకులు

ఓపెన్‌ స్కూల్‌ పరీక్షలకు 90శాతం హాజరు

నారాయణపేట రూరల్‌: సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా చదువుకుంటున్న విద్యార్థులకు బుధవారం నిర్వహించిన ఇంగ్లిష్‌ పరీక్షకు డీవీఎం, గర్ల్స్‌ స్కూల్‌, నారాయణ పాఠశాలల్లో పదో తరగతికి 516మందిని కేటాయించగా వారిలో 462మంది, గురుకుల, శ్రీసాయి, లిటిల్‌స్టార్స్‌, ప్రభుత్వ గ్రౌండ్‌ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఇంటర్‌ పరీక్ష కేంద్రాల్లో 685మందిని కేటాయించగా 626మంది హాజరయ్యారు. మొత్తానికి 90.5శాతం హాజరు నమోదైంది. అదేవిధంగా మధ్యాహ్నం ఒక కేంద్రంలో నిర్వహించిన బిజినెస్‌ స్టడీస్‌ పరీక్షకు ఒకరిని మాత్రమే కేటాయించగా అభ్యర్థి పరీక్ష రాశారు. ఒక్కరి కోసం సీఎస్‌, డీఓ, సీసీ, ఇన్విజిలేటర్‌తో పాటు పోలీసు, వైద్య సిబ్బంది విధులు నిర్వహించారు. పట్టణంలోని పరీక్ష కేంద్రాలను డీఈఓ లియాకత్‌అలీ, టాస్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ యాదయ్యశెట్టి పరిశీలించారు.

కరాటేలో బంగారు పతకం

ఊట్కూర్‌: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మండలానికి చెందిన విద్యార్థి ధనూర్‌ బంగారు పథకం సాధించాడు. మంగళవారం రాత్రి గోవాలో 11 ఏళ్ల విభాగంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఇందులో రాష్ట్ర తరపున ప్రతిభ కనబరిచి, విద్యార్థిని పలువురు అభినందించారు.